సాక్షి
రంగారెడ్డి
శనివారం, 12, జూలై, 2025



తరగతులు ఐదు..

పాఠశాలలు ప్రారంభం అనంతరం సర్కారు బడుల్లో తిష్టవేసిన సమస్యలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి.

8లో▸



విద్యార్థుల అభివృద్ధికి..

విద్యార్థుల అభివృద్ధికి జాతీయ సదస్సులు దోహదపడతాయని మూన్రే కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ అన్నారు.

8లో▸



నగదు బ్యాగు అప్పగింత

పోగొట్టుకున్న రూ.4,01,400 నగదు బ్యాగును పోలీసులు బాధితులకు అప్పగించారు.

8లో▸

న్యూస్‌రీల్

భూ సమస్యలు సత్వరం పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

యాచారం: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. యాచారం తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన భూ సమస్యలు పరిష్కారం కాకపోతే ఎందుకు తిరస్కరించారో కూడా దరఖాస్తు దారులకు తెలియజేయాలని సూచించారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన లబ్ధిదారులకే లాటరీల్లో ప్లాట్లు, రిజిస్ట్రేషన్లు చేసేలా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చూడాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా, నీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వర్షాలు కురిసిన వెంటనే విరివిగా మొక్కలు నాటేలా సిద్ధం కావాలని సూచించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, యాచారం తహసీల్దార్ అయ్యప్ప, మండల పంచాయతీ అధికారి శ్రీలత, ఈజీఎస్ ఏపీఓ లింగయ్య పాల్గొన్నారు.

బాల కార్మికులకు విముక్తి

శంకర్‌పల్లి: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా శుక్రవారం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరుగురు బాల కార్మికులకు పోలీసులు విముక్తి కల్పించారు. సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిల, జన్వాడ గ్రామాల పరిధిలోని రెండు కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో పని చేస్తున్న ఆరుగురు బాల కార్మికులను పోలీసులు గుర్తించారు. అనంతరం వారిని ఠాణాకి తరలించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. రెండు కంపెనీలపై కేసు నమోదు చేశారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆస్పత్రిలో స్టాఫ్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని శుక్రవారం జిల్లా వైద్యాధికారి డా.వెంకటేశ్వర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో స్టాఫ్ రిజిస్టర్, మందుల స్టాకును ఆయన పరిశీలించారు. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో గ్రామాల్లో ప్రబలే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులు ఇవ్వాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డా.మంజులాదేవి, డా.నాగరాజు, డా.మైమునాబేగం, డా.జయశ్రీ, సిబ్బంది తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, సునీత, వేణు, ఏసుమణి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

కందుకూరు: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు మండలంలోని కొత్తగూడ పంచాయతీ కార్యదర్శి ఉమాదేవిని.. పారిశుద్ధ్యం, ట్రాక్టర్ నిర్వహణ, తడి పొడి చెత్త సేకరణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి పంచాయతీ కార్యదర్శి డి.అనితను కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం డీపీఓ సురేష్‌మోహన్ సస్పెండ్ చేశారు.

నేడు నియామక పత్రాలు

సాక్షి, సిటీబ్యూరో: రోజ్‌గార్ మేళా కింద ఎంపికైన కేంద్ర ప్రభుత్వ నూతన ఉద్యోగులకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శనివారం నియామక పత్రాలను అందజేయనున్నారు. సికింద్రాబాద్ బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో నిర్వహించనున్న రోజ్‌గార్‌మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన యువతకు నియామక లేఖలు అందజేస్తారు.

అక్రమాలకు.. అధికారిక ముద్ర!

పాత లేవుట్‌లో ఖాళీ స్థలాలే టార్గెట్

- ఫేక్ డాక్యుమెంట్లతో కనికట్టు
- గుట్టుగా ప్రొసీడింగ్స్ ఇస్తున్న రెవెన్యూ
- ఇంటి నంబర్లు జారీ చేస్తున్న మున్సిపాలిటీలు
- లింకు లేకుండానే కొనసాగుతున్న రిజిస్ట్రేషన్లు
- స్థానికుల ఫిర్యాదులతో బయటపడుతున్న భూ ఆక్రమణలు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: లింకు డాక్యుమెంట్ నంబర్ లేకపోయినా.. ఇరువురి మధ్య ఆర్థికపరమైన లింకు కలిస్తే చాలు.. ఎలాంటి స్థలానికైనా ఇట్టే రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. రెవెన్యూ, మున్సిపల్, సబ్ రిజిస్ట్రార్లు అక్రమార్కులతో చేతులు కలుపుతూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. విలువైన స్థలాల ఆక్రమణలకు, ఘర్షణలకు కారణమవుతున్నారు. అక్రమ లే అవుట్‌కు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ సహా గండిపేట ఎస్‌ఆర్‌ఓ అధికారిక ముద్ర వేస్తే.. ఎలాంటి నిర్మాణాలు లేని ఖాళీ ప్లాట్లకు ఎల్బీనగర్ మున్సిపల్ అధికారులు ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారు. లింకు డాక్యుమెంట్ నంబర్ లేని ప్లాట్లకు ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇక ఎల్‌ఆర్‌ఎస్ నిబంధనలకు విరుద్ధంగా నాలా కన్వర్షన్ కానీ ఖాళీ స్థలాలకు తాండూరు ఎస్‌ఆర్‌ఓ తేదీలు ఏమార్చి రెండు వందలకుపైగా ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయడం వివాదాస్పదమైంది.

అదే గండిపేట రహస్యం

సికిందర్‌గూడలోని పది ఎకరాల భూమిపై కోర్టులో వివాదం కొనసాగుతోంది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారిక రికార్డుల్లో ఆ భూములపై డీఏజీపీఏ (డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) ఉన్నప్పటికీ తప్పుడు సమాచారంతో దాన్ని రద్దు చేసి, రాత్రికిరాత్రే నాలా కన్వర్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే ఓ తెల్లకాగితంపై లే అవుట్, అందులోని ఖాళీ ప్లాట్లకు బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ ఇంటి నంబర్లు జారీ చేయడం, తర్వాత వారు టీఎస్ బీపాస్‌కు దరఖాస్తు చేయడం, ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం అన్నీ చకచకా జరిగిపోయాయి. ఇంటి నిర్మాణానికి జారీ చేసిన తాత్కాలిక అనుమతుల ఆధారంగా ఏకంగా 23 ప్లాట్లకు గండిపేట సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్లు చేయడం గమనార్హం. మున్సిపల్ కార్పొరేషన్, రిజిస్ట్రేషన్ అధికారులు కలిసి అక్రమ లే అవుట్‌కు అధికారిక ముద్ర వేశారు. అప్పటికే జీపీఏ చేసుకున్న నిర్మాణ సంస్థ ఫిర్యాదుతో విషయం బయటపడింది.

అవకాశంగా లొసుగులు

సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ రెవెన్యూ సర్వే నంబర్ 60లోని భూమిని 45 ఏళ్ల క్రితమే అప్పటి పంచాయతీ అనుమతితో లే అవుట్ చేశారు. యజమానులు ఆయా ప్లాట్లన్నీ అమ్మేశారు. అప్పట్లో డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసే వ్యవస్థ లేకపోవడం, ప్రస్తుతం ఆయా ప్లాట్ల వివరాలు ఆన్‌లైన్‌లో కన్పించక పోవడాన్ని ఓ ముఠా అవకాశంగా తీసుకుంది. తొలుత పాతస్టాంపు పేపర్లపై నోటరీ డాక్యుమెంట్ సృష్టించింది. తర్వాత ఆస్తికి వ్యాల్యూయేషన్ చేయించింది. ఎల్బీనగర్ మున్సిపల్ అధికారులకు డబ్బుల ఎర వేసి ఎలాంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలానికి ఇంటి నంబరు సహా ఆస్తిపన్ను చెల్లింపు రసీదులను సంపాదించింది. పూర్వ లింకుడాక్యుమెంట్ నంబర్, ఈసీ కూడా లేని ఖాళీ ప్లాట్‌కు ఎల్బీనగర్ సబ్‌రిజిస్ట్రార్ ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేశారో అంతు చిక్కడం లేదు. రూ.2 కోట్లకుపైగా విలువ చేసే ఖాళీ స్థలాన్ని ఇటీవలే ఓ ప్రైవేటు వ్యక్తికి కట్టబెట్టింది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఇచ్చిన పత్రాల ఆధారంగానే తాను రిజిస్ట్రేషన్ చేయాల్సి వచ్చిందని, తర్వాత స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుతో డాక్యుమెంట్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టడం జరిగిందని ప్రస్తుత ఎస్‌ఆర్‌ఓ చెబుతుండటం విశేషం. ఈ ఒక్క లే అవుట్‌లోనే ఈ తరహా ప్లాట్లు మరో 20 వరకు ఉన్నట్లు సమాచారం.

స్కానింగ్ చేయకపోవడంతో..

అనధికారిక లే అవుట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ లేని ఖాళీ ప్లాట్లకు తాండూరు సబ్ రిజిస్ట్రార్ అధికారులు అధికారిక ముద్ర వేశారు. నిబంధనల ప్రకారం 2020 ఆగస్టు 26 నాటికి వేసిన లే అవుట్‌లోని ప్లాట్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. లే అవుట్‌లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయిఉన్నప్పుడే మిగతావి కూడా రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలు కల్పించింది. ఈ ఉత్తర్వులను అవకాశంగా తీసుకుని కటాఫ్ తేదీ తర్వాత వేసిన లే అవుట్‌లోని ప్లాట్లను కటాఫ్ తేదీలోని ప్లాట్లుగా చూపించి 25 శాతం రాయి తీతో ఆరు రోజుల్లోనే రెండు వందలకుపైగా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. డాక్యుమెంట్లు స్కానింగ్ చేయక పోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడ నాలా కన్వర్షన్ లేని 37,061 గజాల స్థలానికి జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేయడం వివాదాస్పదమైంది.

లేని ఉద్యోగి పేరున..

నార్సింగి మున్సిపల్ పరిధి సర్వే నంబర్ 300 నుంచి 303 వరకు, 306 నుంచి 311 వరకు, 313 నుంచి 315లోని భూమిలో గతంలోనే మార్వటౌన్ షిప్-బి లే అవుట్ చేశారు. అందులోని 617 గజాల ఖాళీ పార్కు స్థలాన్ని గతంలోనే పూర్వ పంచాయతీ పేరున మార్ట్‌గేజ్ చేశారు. రూ.6 కోట్ల విలువ చేసే ఈ ఖాళీ స్థలంపై ఓ ముఠా కన్నేసింది. పంచాయతీ పేరున మార్ట్‌గేజ్ చేసిన ప్లాట్‌ను రిలీజ్ చేస్తున్నట్లు ప్రస్తుత మున్సిపాలిటీ పేరున డాక్యుమెంట్ సృష్టించి, రిజిస్ట్రేషన్‌కు యత్నించింది. ప్రస్తుత ఎస్‌ఆర్‌ఓ గుర్తించి, సంబంధిత మున్సిపల్ అధికారికి సమాచారం ఇవ్వగా విషయం బయటికి వచ్చింది. మున్సిపాలిటీలో లేని ఉద్యోగి పేరున ఫేక్ మార్ట్‌గేజ్ రిలీజ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తేలింది.



మాడ్గులలో ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు తదితరులు

అభివృద్ధి ఘనత మాదే

- మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు
- మాడ్గుల పరిధిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మాడ్గుల: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 90 శాతం స్థానాలను కైవసం చేసుకుంటుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయనతోపాటు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి మండల కేంద్రంలో రూ.12.70 కోట్లతో నిర్మించే 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆమనగల్లు మండలం కోనాపూర్ నుంచి మాడ్గుల వరకు రూ.45 కోట్లతో చేపట్టే, మాడ్గుల నుంచి అందుగులకు రూ.30 కోట్లతో నిర్మించే బీటీ డబుల్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. 220 మందికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ బట్టు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తోందని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగునీరందిస్తామని చెప్పారు. ట్రిపుల్ ఆర్, ఐటీ పరిశ్రమలు, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో రాబోయే రోజుల్లో మాడ్గులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ఎప్పుడూ ప్రజల పక్షమేనని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా సాగుతున్న మాదిగల వర్గీకరణపై సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపి బిల్లుకు అసెంబ్లీలో ఆమోదించడం జరిగిందని తెలిపారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సంకల్పమని, ఆ దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

బీఆర్‌ఎస్ పాలనలో అధోగతి

పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. ఆ అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తోందని చెప్పారు. బీసీ కులగణన చేపట్టడంతో పాటు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ పద్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నేరెళ్ల శారద

విద్యావ్యవస్థలో మార్పులు అవసరం

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

ఇబ్రహీంపట్నం: విద్యా వ్యవస్థలో సమూల మార్పులు అవసరమని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. ఇందులో పేద, ధనిక అనే తేడా లేకుండా పిల్లలందరూ ఒకే చోట చదివిన రోజే నవ శకానికి అడుగులు పడుతాయని ఆకాంక్షించారు. సామాజిక బాధ్యతలో భాగంగా కెఫిన్ టెక్నాలజీ కార్పొరేట్ సంస్థ రూ.1.10 కోట్లు వెచ్చించి సంకల్ప్ పేరుతో ఇబ్రహీంపట్నంలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆధునీకరించింది. నూతన వసతుల ప్రారంభోత్సవానికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి హాజరైన ఆమె మాట్లాడుతూ.. కులమతాలు, పేద, ధనిక తారతమ్యం లేని విద్యాలయాల రూపకల్పన కోసం ప్రధాని, ముఖ్యమంత్రికి ప్రతీ ఇంటినుంచి ఒక లేఖ రాయాలని పిలుపునిచ్చారు. అమ్మాయిల చదువుతోనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థినులకు సూచించారు. స్వల్పకాలిక ఆనందాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదని, అవసరం మేరకే సోషల్ మీడియాను వినియోగించాలని తెలిపారు. ప్రైవేటు హాస్టళ్లతో పోలిస్తే ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన సదుపాయాలు ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, బాగా చదవాలని కోరారు. పాశ్చాత్య ధోరణులను, విష సంస్కృతిని విడనాడాలన్నారు. ఆడ పిల్లలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పోలీసులను ఆశ్రయించాలని, వారి వివరాలు బయటపెట్టకుండా తానే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మహిళా కమిషన్‌కు వస్తున్న అధిక ఫిర్యాదులు లివింగ్ రిలేషన్‌షిప్‌లకు సంబంధించినవేనని తెలిపారు. వసతుల కల్పనకు కృషిచేసిన కేఫిన్ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ సెక్రటరీ పద్మజ, కెఫిన్ టెక్ సంస్థ హెచ్‌ఆర్ సుజన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ కరుణాకర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూపతిగాల్ల మహిపాల్, డీటీడీఓ రమాదేవి, డీఈఓ సుశీందర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, సీఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలుగో రోజు 4,170 మంది



ఫార్మా ప్లాట్ల లాటరీ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- రైతులకు ప్లాట్ల కేటాయింపు
- ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్

కందుకూరు: మండలంలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలోని ఏటీసీ సెంటర్‌లో నిర్వహిస్తున్న లాటరీ ద్వారా ఫార్మా ప్లాట్ల కేటాయింపు ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. లాటరీ ద్వారా ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ తదితర అంశాలను పర్యవేక్షించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. నాలుగో రోజు 4,170 మంది లబ్ధిదారులకు ప్లాట్లను డ్రా తీసినట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. అందులో 2,062 మంది హాజరు కాగా 1,572 మంది గైర్హాజరైనట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకోవడానికి గైర్హాజరైన వారు ఫారం 32ఏ, ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, నాయిబ్ తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

- ఏసీపీ లక్ష్మీనారాయణ



రికార్డులు పరిశీలిస్తున్న ఏసీపీ

కొందుర్గు: పోలీసులను ఆశ్రయించిన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఏసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. కొందుర్గు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పలు రకాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నేరస్తులను గుర్తించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని ఎస్ రవీందర్ నాయక్‌కు సూచించారు.

పరిశీలిస్తాం.. పరిష్కరిస్తాం

- వీలైనంత త్వరగా చర్యలు
- శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్
- ఫోన్‌ఇన్ కార్యక్రమానికి స్పందన



సాక్షి ఫోన్ ఇన్

శంకర్‌పల్లి: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు సన్నద్ధంగా ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.యోగేశ్ తెలిపారు. 'సాక్షి' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పట్టణ వాసులు పారిశుద్ధ్యం, అంతర్గత మురుగునీటి కాలువలు, రోడ్లు, వీధి కుక్కలు, ఆక్రమణలు వంటి అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని ఓపిగ్గా విని, నమోదు చేసుకుని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ప్రశ్న: శంకర్‌పల్లిలో పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మించిన దుకాణాలకు కాలం ముగిసినప్పటికీ రీ టెండర్లు వేయడం లేదు. మున్సిపాలిటీకి ఏటా కోట్లలో నష్టం వస్తోంది.

– దయాకర్‌రెడ్డి (బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు), మహేందర్‌రెడ్డి (శంకర్‌పల్లి)

కమిషనర్: దుకాణాల రీటెండర్ ప్రక్రియపై కసరత్తు చేస్తున్నాం. కలెక్టర్ వేసిన కమిటీ రిపోర్టు ఆధారంగా ముందుకు వెళ్తాం. వీలైనంత త్వరగా రీటెండర్ చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాం.

ప్రశ్న: సింగాపురంలో శ్మశానవాటిక లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బంది ఏర్పడుతోంది. పలు కాలనీల్లో తాగునీటి సమస్య ఉంది.

– వెంకట్‌రాంరెడ్డి, శశిధర్‌రెడ్డి (సింగాపురం)

జవాబు: శ్మశానవాటిక కోసం స్థల అన్వేషణ చేస్తున్నాం. ఇప్పటికే రెవెన్యూ అధికారులతో చర్చిస్తున్నాం. త్వరలో స్థల సేకరణ చేసి, నిర్మిస్తాం. పాడైన బోర్లను వెంటనే గుర్తించి మరమ్మతులు చేయిస్తాం.

ప్రశ్న: ఖాళీ ప్రదేశాల్లో పిచ్చిమొక్కలు, చెత్తా, చెదారం పెరిగిపోయాయి. పాములు, దోమల బెడద ఎక్కువైంది. కొన్నిచోట్ల రోడ్లు పాడై వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బంది ఎదురవుతోంది.

– మహమ్మద్ యూనస్ (బ్లూ ఉడ్ వెంచర్, శంకర్‌పల్లి)

జవాబు: పారిశుద్ధ్య కార్మికులు, డోజర్లతో చెత్తను వెంటనే శుభ్రం చేయిస్తాం. రోడ్లు పాడైన చోట తాత్కాలికంగా మొరం వేసి బాగు చేస్తాం.

ప్రశ్న: ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి నుంచి శంకర్‌పల్లి చౌరస్తా వరకు రహదారి నిర్మాణం అసంపూర్తిగా ఉంది. పెద్ద ఎత్తున గుంతలు ఉండడంతో రాత్రి వేళ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

– శ్రీకాంత్‌రెడ్డి, మహేశ్ (రావులపల్లి)

జవాబు: ఈ విషయమై ఇప్పటికే ఆర్‌అండ్‌బీ, పోలీసులతో కలిసి పరిశీలించాం. ఆర్‌అండ్‌బీ ఈఈతో మాట్లాడి వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తాం.

ప్రశ్న: ఆదర్శనగర్ కాలనీలో అంతర్గత మురుగునీటి కాలువలు, రోడ్లు, తాగునీరు, గుంతల్లో మొరం వేయడం వంటి సమస్యలు ఉన్నాయి.

– రాంచందర్, రాములు, మాణిక్, అంజనేయులు (ఆదర్శనగర్ కాలనీ)

జవాబు: అంతర్గత మురుగునీటి కాలువలు, రోడ్ల నిర్మాణం కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాం. ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తాం. సిబ్బందిని పంపి రోడ్లపై గుంతల్ని పూడ్చి వేయిస్తాం.

ప్రశ్న: పిచ్చి మొక్కలు విపరీతంగా ఉండడంతో దోమల బెడద ఎక్కువైంది. పిల్లలు ఆడుకోడానికి సరైన పార్కులు లేవు. కొంత మంది ఇంట్లో సెప్టిక్ ట్యాంకు నిర్మించుకోకుండా.. డ్రైనేజీలోకి వదిలేస్తున్నారు.

– శ్రీనివాస్, రఘుపాల్‌రెడ్డి, రవీందర్, ఫణి రాజ్ (శ్రీరాంనగర్ కాలనీ)

జవాబు: కాలనీలో పార్కు కోసం రూ.17 లక్షలతో ప్రతిపాదనలు పంపాం. అక్రమ నిర్మాణాలు, సెప్టిక్ ట్యాంకుల గురించి సిబ్బందిని పంపి విచారణ చేస్తాం. ఇష్టారీతిన చెత్త, చెదారం వేసే వాళ్లకు జరిమానా వేసేందుకు సిద్ధం అవుతున్నాం.

ప్రశ్న: మణిగార్డెన్ ఎదురుగా ఉన్న కాలనీలో 30 ఇళ్లకుపైగా ఉన్నప్పటికీ నీటి కనెక్షన్ లేదు. ఉన్న బోరును కూడా మరమ్మతులకు గురైన ప్రతీసారి మేమే సొంతంగా బాగు చేయించుకుంటున్నాం. అంతర్గత మురుగునీటి సమస్య సైతం ఉంది.

– మాణిక్యప్రభు, వెంకటేశ్వరరావు, వీరేశం, లక్ష్మారెడ్డి, రాజేందర్‌రెడ్డి (9వ వార్డు, మణిగార్డెన్ ఎదురుగా)

జవాబు: అమృత్ 2.0 కింద పట్టణంలో ఆరు తాగు నీటి ట్యాంకులను నిర్మిస్తున్నాం. వాటి ద్వారా సరఫరా చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. పాడైనా బోర్లకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

ప్రశ్న: గీతా మందిర్ ప్రాంతంలో ఆరు నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రి వేళ ఇంటి నుంచి బయటికి రావడానికి ఇబ్బంది అవుతోంది.

– దామోదర్, రమేశ్, సందీప్, విజయ్ (గీతా మందిర్)

జవాబు: సిబ్బందిని పంపి వెంటనే అవసరమున్న చోట వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న: పోలీస్ క్వార్టర్స్‌కి సమీపంలో కొత్త సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో కొంత మంది ప్రభుత్వ స్థలాన్ని అక్రమిస్తున్నారు.

– గోవర్ధన్, నర్సింగ్‌రావు (15వ వార్డు)

జవాబు: ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులను పంపి సమస్యను పరిష్కరిస్తాం.

ప్రశ్న: మున్సిపల్ పార్కులో పిచ్చి మొక్కలు పెరిగాయి, సెంట్రల్ లైటింగ్ సిస్టం పాడైంది.

– సంపత్, రవీందర్‌రెడ్డి (గాయత్రీ నగర్)

జవాబు: సిబ్బందిని పంపి, వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం.

పోగొట్టుకున్న నగదు బ్యాగు అప్పగింత



బాధితులకు నగదు సంచిని అందజేస్తున్న పాఠశాల నిర్వాహకులు

కందుకూరు: పోగొట్టుకున్న నగదు సంచిని పోలీసులు బాధితులకు అప్పగించారు. సీఐ సీతారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లికి చెందిన ఎంకే విష్ణువర్ధన్ వద్ద పని చేసే సురేష్.. గురువారం సాయంత్రం మండల పరిధి జైత్వారం సమీపంలోని రాంరెడ్డి ఫౌల్ట్రీ ఫాంనకు వచ్చాడు. అక్కడ నుంచి రూ.4,01,400(నాలుగు లక్షల పద్నాలుగు వందల రూపాయలు)లను బ్యాగులో పెట్టుకుని బైక్‌పై తిరిగి విఠాయిపల్లికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తగూడ శ్రీ నికేతన్ స్కూల్ వద్ద డబ్బుల బ్యాగు పడిపోయింది. కొద్దిసేపటికి కిందపడ్డ ఆ బ్యాగ్‌ను గుర్తించిన ఆ స్కూల్ అడ్మిన్ రోజ.. ఆ నగదు సంచిని భద్రపరిచారు. పోగొట్టుకున్న వారు ఎవరైనా వస్తే ఇద్దామని వేచి ఉన్నారు. బ్యాగ్ పడిపోయిన విషయాన్ని బాధితుడు సురేష్.. తన యజమానికి చెప్పాడు. ఆయన అక్కడి కౌన్సిలర్ సుజాత సహాయంతో కందుకూరు పీఎస్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సీఐ సీతారామ్, ఎస్‌ఐ సైదులు ఆ మార్గంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను తనిఖీ చేయాలని కానిస్టేబుల్ కృష్ణ, హోంగార్డు రమేష్‌ను ఆదేశించారు. దీంతో వారు జైత్వారం నుంచి కెమెరాలను పరిశీలన చేసుకుంటూ.. కొత్తగూడ వైపునకు వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కొత్తగూడ పరిధి శ్రీ నికేతన్ హైస్కూల్ వద్ద కెమెరాల తనిఖీకి వచ్చిన పోలీసులకు.. ఆ పాఠశాల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి నగదు బ్యాగు భద్రపరిచిన విషయం చెప్పారు. అనంతరం పోలీసుల సమక్షంలో.. పాఠశాల నిర్వాహకులు నగదు బ్యాగ్‌ను బాధితులకు అప్పగించారు.

ఇంజినీరింగ్‌లో మహేశ్‌కు డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: ఇంజినీరింగ్‌లో పరిశోధన చేసిన ఎనుముల మహేశ్‌కు డాక్టరేట్ లభించింది. ఇంజినీరింగ్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌లో పరిశోధనకు గాను రాజస్థాన్ అజ్మీర్‌లోని భగవత్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నాడు. ఈ పరిశోధనకు 2021లో మహేశ్.. ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి పెటెంట్ పొందారు. పరిశోధన ఫలితాలను జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో ప్రచురించిన నేపథ్యంలో వాటి ఆధారంగా డాక్టరేట్ దక్కింది. పట్టాను భగవత్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ వి.కె.శర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు మహేశ్‌ను అభినందించారు.



ఉపకులపతి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న మహేశ్

గొలుసు దొంగ రిమాండ్

మీర్‌పేట: చైన్ స్నాచర్‌ను మీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట వందనపురి కాలనీకి చెందిన చెవుల సంధ్య ఈ నెల 9న మధ్యాహ్నం సరుకుల కోసం సమీపంలోని కిరాణ దుకాణానికి వెళ్లింది. తిరిగి వస్తుండగా.. నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలానికి చెందిన సెంట్రింగ్ పనిచేసే కందనూలు మల్లేశ్(28) ఇల్లు అద్దెకు కావాలని ఆమెను వెంబడించాడు. సదరు మహిళ ఇంట్లోకి వెళ్లగా.. మరలా వచ్చి ఏదైనా పని ఇప్పించాలని అడిగి, ఆమె మెడలోని రెండు తులాల పుస్తెలతాడును తెంచుకుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. శుక్రవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. బంగారు గొలుసు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించారు.

యువకుడు అదృశ్యం



యాదగిరి(ఫైల్)

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు గ్రామానికి చెందిన నర్సింహ కుమారుడు పాతకోట యాదగిరి(35) తుక్కుగూడలోని మారుతీ షోరూంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 7న రోజు మాదిరిగానే విధులకు వెళ్లిన యువకుడు తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అతనికోసం తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో సదరు వ్యక్తి బామ్మర్ది జగన్ గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు. వివరాల తెలిసిన వారు ఠాణాలో కానీ.. 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

తరగతులు ఐదు.. గది ఒక్కటి

రోడ్డు పక్కనే విద్యార్థులకు బోధన

- పట్టించుకోని విద్యాధికారులు
- సర్కారు బడుల అభివృద్ధిపై ప్రశ్నిస్తున్న గ్రామస్తులు
- అదనపు గదులు నిర్మించాలంటూ డిమాండ్



పాఠశాల వరండాలో రెండు తరగతుల చిన్నారులకు పాఠాలు చెబుతున్న హెచ్‌ం రేష్మ



పాఠశాల ఎదుట 5వ తరగతి విద్యార్థులకు బోధన

మొయినాబాద్‌రూరల్: 'ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధిస్తున్నాం. చిన్నారులకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నాం. మౌలిక వసతులు కల్పిస్తున్నాం. మీ పిల్లల భవిష్యత్తు మాది'అని ఈ విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు చేపట్టిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాధికారులు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. బడీడు పిల్లలను, ప్రైవేటు బడి బాటలో ఉన్నవారిని సైతం సర్కారు బడుల్లో చేర్పించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంత వరకు బాగనే ఉన్నా.. పాఠశాలల ప్రారంభం అనంతరం సర్కారు బడుల్లో తిష్టవేసిన సమస్యలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. తరగతి గదులు, సౌకర్యాల కొరత, ఉపాధ్యాయుల లేమితో చిన్నారుల విద్యాభ్యాసం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు మొయినాబాద్ మండలం అప్పారెడ్డిగూడ పాఠశాలే నిదర్శనం.

రోడ్డు పక్కన చెట్ల కింద..

మండల పరిధి అప్పారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో 1- 5వ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థుల సంఖ్య 50కి పైగానే ఉంది. ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు భోదిస్తున్నారు. గత సంవత్సరంలో చిన్నారు సంఖ్య 38 ఉండగా.. ఈ ఏడాది అది స్వల్పంగా పెరిగింది. పాఠశాలకు మొత్తం ఒకే తరగతి ఉండటంతో ఐదు తరగతుల విద్యార్థులు బోధించడం కష్టంగా మారింది. దీంతో క్లాస్ రూమ్‌లో 1,2 తరగతులు, వరండాలో రెండు తరగతులు, రోడ్డు పక్కన చెట్ల కింద 5వ తరగతి వారికి పాఠాలు చెబుతున్నారు. బోధన విషయంలో ఉపాధ్యాయులు కృషి బాగానే ఉన్నా.. అదనపు గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరిన్ని గదులు నిర్మిస్తే నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని టీచర్లు పేర్కొంటున్నారు.

ఆసక్తి ఉన్నా.. అయిష్టతే



అప్పారెడ్డిగూడ సర్కారు బడిలో పిల్లలు చేరేందుకు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. కానీ ఒకే తరగతి గది ఉండటంతో అయిష్టత చూపుతున్నారు. వర్షం వస్తే పాఠశాల కొనసాగడం కష్టమే అవుతుంది. ప్రభుత్వం అదనపు తరగతి గదులను నిర్మించాలి. అప్పుడు విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.
– శ్రీనివాస్, అప్పారెడ్డిగూడ

అధికారులకు తెలిపాం..



పాఠశాలకు ఒక తరగతి గది, వరండా మాత్రమే ఉంది. ఐదు తరగతులకు 50 మంది చిన్నారులు ఉన్నారు. బోధనలో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ.. అదనపు గదులు లేని కారణంగా వరండా, ఆరుబయట పాఠాలు చెబుతున్నాం. వర్షం వస్తే చాలా ఇబ్బంది. అదనపు గదుల నిర్మాణం గురించి పై అధికారులకు వివరించాం.
– రేష్మ, హెచ్ఎం, అప్పారెడ్డిగూడ

విద్యార్థుల అభివృద్ధికి సదస్సు దోహదం

ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థుల అభివృద్ధికి జాతీయ సదస్సులు దోహదపడతాయని మూన్రే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ శివారులోని మూన్రే ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్(ఎంఐపీఎస్) కళాశాలలో ఈ నెల 16, 17న మిప్స్కాన్-2025 జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. శుక్రవారం కళాశాలలో సంస్థ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి అధ్యక్షతన సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. జాతీయ సదస్సుల ద్వారా విద్యార్థులకు పరిశోధన, నైపుణ్యం, పరిశ్రమలలో అనుసంధానం తదితర అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ మిప్స్కాన్ జాతీయ సదస్సుకు దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, పరిశోధకులు పాల్గొంటుండటంతో ఒక గొప్ప శాస్త్రీయ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్, అభివృద్ధికి ఇలాంటి సదస్సులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, విద్యా ప్రయాణానికి మైలురాయిగా మలుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య



బాధితుడికి చెక్కు అందజేస్తున్న సీపీఐ నాయకులు

షాబాద్: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామానికి చెందిన పాలమాకుల ఆనందంకు రూ.1 లక్ష 48 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మక్దూం భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో చెక్కు మంజూరు అయిందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నర్సింహాలు, మండల కార్యదర్శి శ్రీశైలం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత ముఖ్యం

సీఐ వెంకట్

మోమిన్‌పేట: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సీఐ వెంకట్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సీఐ కార్యాలయంలో సైబర్ నేరాల అప్రమత్తతపై విలేకరులతో మాట్లాడారు. ఫోన్ పోగొట్టుకున్న మరుక్షణమే సిమ్‌ను బ్లాక్ చేయించాలన్నారు. ప్రతిఒక్కరూ డిజిటల్ పేమెంట్స్ చేస్తుండటంతో సైబర్ నేరాల సంఖ్య పెరిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్ చేయాలని సూచించారు. సర్కిల్ పరిధిలో 8 సైబర్ కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం రూ.42,58,555లు పోగొట్టుకోగా రూ.8,65,778 రికవరీ చేశామని వెల్లడించారు. ఇంకా పెండింగ్‌లో రూ.1,81,105 ఉన్నాయన్నారు. మోమిన్‌పేటకు చెందిన శివకుమార్ ఫోన్ పోగొట్టుకోగా అందులో ఉన్న రూ.1,44,000 పోయాయి. ఇలానే మర్పల్లికి చెందిన రాజువి రూ.10 లక్షలు పోయాయి. వెంటనే స్పందించి సిమ్ బ్లాకు చేయడంతో మొత్తం రికవరీ చేశామన్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కానిస్టేబుళ్లు జావిద్, అనిల్‌కుమార్ చాకచక్యంగా వ్యవహరించి డబ్బులను రికవరీ చేయడంలో కీలక పాత్ర పోషించారని అభినందించారు. ఆయన వెంట ఎస్‌ఐ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ దారుడిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: బాలకతో వెట్టిచాకిరి చేయిస్తున్న ఓ రియల్ ఎస్టేట్ యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఆదిబట్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి ఎంపీపటేల్‌గూడ సమీపంలో అనిల్ కన్‌స్ట్రక్షన్ యజమాని, భవన నిర్మాణ రంగంలో జార్ఖండ్‌కు చెందిన 16 ఏళ్ల బాలికతో పనిచేయిస్తుండగా.. బాలికకు విముక్తి కల్పించారు. అనంతరం యజమానిపై కేసు నమోదు చేశారు.

వ్యక్తి బలవన్మరణం

ఇబ్రహీంపట్నం: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని త్రిశక్తి కాలనీలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలో అద్దె ఇంట్లో మొదటి అంతస్తులో నివాసముంటున్న కర్ణంగూడకు చెందిన చెలమంద చారి(56) కొంత కాలంగా ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. గురువారం అర్ధరాత్రి కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని స్లాబ్ హుక్కుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

గంజాయి తరలిస్తున్న వడ్డీవ్యాపారి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల్లో సొంత భవనాలు, రూ.లక్షల్లో వడ్డీల వ్యాపారం, అయినా ఇంకా సంపాదించాలనే దురాశతో గంజాయి వ్యాపారం మొదలెట్టిన వడ్డీవ్యాపారి సికింద్రాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ సిబ్బందికి గంజాయితో సహా నారాయణగూడ వైఎంసీఏ వద్ద పట్టుబడ్డాడు. ఒరిస్సా నుంచి గంజాయిని దిగుమతి చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా బైక్‌పై తీసుకువెళ్లి సరఫరా చేస్తున్న చెన్న రమేష్ గౌడ్ డీటీఎఫ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. మల్లాపూర్ నుంచి కోఠి వైపు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనంపై గంజాయిని తీసుకెళ్తుండగా సీఐ సావిత్రి సౌజన్య, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, ఖలీం, కానిస్టేబుళ్లు రాజు, రవి, శిల్ప, సునీత, రమేష్, తదితరులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయితో పాటు రూ. 20వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

జింక మాంసం విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్

గోల్కొండ: జింక తల, కొమ్ములు, మాంసం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను టోలిచౌకీ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్ నాయక్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎండి లైన్స్‌కు చెందిన మహ్మద్ సిరాజ్, మహ్మద్ వసీమ్‌లు జింక మాంసాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మహ్మద్ సిరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి జింక తల మాంసం, కొమ్ములు స్వాధీనం చేసుకుని అతడితో పాటు మహ్మద్ వసీమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా తాను జింక తలను పాత నగరంలోని చౌక్ వద్ద ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు నిందితుడు మహ్మద్ సిరాజ్ తెలిపారు. తలను తన స్నేహితుడు మహ్మద్ వసీంతో కలిసి ఎండీలైన్స్‌లోని ఓ మాంసం దుకాణంలో ముక్కలు ముక్కలుగా చేసి కొమ్ములను వేరు చేశాడన్నారు. స్వాధీనం చేసుకునన్న జింక మాంసం, కొమ్ములను డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారికి అప్పగించామన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

- ఒడిశానుంచి పూణేకు అక్రమ రవాణా
- మహిళతో సహా అరుగురి అరెస్ట్
- 108 కేజీల గంజాయి స్వాధీనం

రాజేంద్రనగర్: ప్రజలు ఇచ్చిన సమాచారంతో అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు వారి నుంచి భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రజలు ఇచ్చిన సమాచారంతో గురువారం సాయంత్రం రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్‌ఆర్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు ఐదుగురు యువకులు, ఒక మహిళను అదుపులోకి తీసుకుని వారి నుంచి 108 కేజీల గంజాయి, రెండు కార్లు, 6 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఒడిశాకు చెందిన పవన్ దీప్ స్థానికంగా గంజాయి వ్యాపారం చేసేవాడన్నారు. పూణేకు చెందిన ప్రశాంత్ అతడిని కలిసి గంజాయి కావాలని కోరడంతో పవన్ దీప్ అందుకు అంగీకరించారు. దీంతో ప్రశాంత్‌తో పాటు లతా గణేష్ జాదవ్, సచిన్, రోషన్, రసూల్ బాబురావు, గౌరవ్ రెండు కార్లలో ఒడిశా వెళ్లారు. అక్కడ పవన్ దీప్ నుంచి 108 కేజీల గంజాయిని కొనుగోలు చేసి రెండు కిలోల చొప్పున ప్యాక్ చేసుకుని కారు సీట్లు, కారు వెనుక భాగంతో పాటు డోర్లలో దాచి పూణేకు బయలుదేరారు. గురువారం సాయంత్రం వీరు ప్రయాణిస్తున్న కార్లు రాజేంద్రనగర్ ఓఆర్‌ఆర్ వద్దకు చేరుకున్నారు. అప్పటికే ఓ వ్యక్తి ఇచ్చిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో అక్కడికి వచ్చి స్విఫ్ట్, ఇగ్నిష్ కార్లను సోదా చేయగా గంజాయిని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 108 కేజీల గంజాయి, రూ.9,700 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ప్రశాంత్ 2022లో గంజాయి రవాణా చేస్తూ కోదాడ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లాడన్నారు. నిందితులందరూ పూణేకు చెందిన వారని, వారిలో బాబురావు, గౌరవ్, ప్రశాంత్‌లపై పలు కేసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. గంజాయి విక్రయించిన ఒడిశాకు చెందిన పవన్ దీప్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో రాజేంద్రనగర్ ఎస్‌ఓటీ, పోలీసులు, అదనపు డీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

హ్యుందాయ్ డిజిటల్ ఫ్లోట్ వ్యాన్‌లు ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: భారతదేశంలో మొదటి స్మార్ట్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్, అతిపెద్ద ఎగుమతిదారు హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఇటీవల గ్రామీణ అవుట్‌లెట్‌లలో డిజిటల్ ఫ్లోట్ కార్యకలాపాలను ప్రారంభించింది. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాలలో లోతైన, గణనీయమైన వ్యాప్తి అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని డిజిటల్ ఫ్లోట్ కాన్సెప్ట్‌ను ప్రవేశపెట్టారు. హ్యుందాయ్ హ్యాచ్‌బ్యాక్ ఎస్‌యూవీ ఎక్స్టర్, వెన్యూ, గ్రాండ్ ఐ10 నియోస్ వినియోగదారుల ఇంటి వద్దకు నేరుగా రవాణా చేస్తారు. కార్యక్రమాన్ని హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ ఆర్ఎస్‌హెచ్ రామ్‌కుమార్ జి, ఆర్‌పిఎస్‌హెచ్ మనోజ్ బాథం, హైదరాబాద్ నుంచి డిజిటల్ ఫ్లోట్ వ్యాన్‌లను జెండా ఊపి ప్రారంభించారు. ఇవి ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రయాణించనున్నాయని వారు తెలిపారు.

రాష్ట్రంలో 9 శాతం మందిలో కిడ్నీ సమస్యలు

- నెఫ్రో ప్లస్ సీఈఓ రోహిత్ సింగ్
- మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల్లో సీడీకేపై సర్వే

సాక్షి, సిటీబ్యూరో: మధుమేహం, తరచూ పెయిన్ కిల్లర్స్ వినియోగం, అధిక రక్తపోటు, జీవన శైలి అంశాలు దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి (సీడీకే)లో కీలక పాత్ర పోషిస్తున్నాయని నెఫ్రోప్లస్ సీఈఓ రోహిత్ సింగ్ అన్నారు. మాదాపూర్‌లోని తమ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కిడ్నీ వ్యాధి బాధితులు చివరి 3, నాలుగు దశల్లో గుర్తిస్తున్నారని తెలిపారు. వ్యాధిని ముందస్తుగా ఒకటి, రెండు దశల్లో గుర్తిస్తే జీవన నాణ్యతను మెరుగుపరిచే అవకాశం ఉందన్నారు. గత మార్చి 6 నుంచి 11వ తేదీ మధ్య 10,501 మంది సీడీకే నివారణ చర్యల కోసం సైన్‌అప్ చేశారని, 5 వేల మందికిపైగా సీరం క్రియేటిన్ పరీక్షలు చేయించుకున్నట్లు వివరించారు. తెలంగాణలోని హైదరాబాద్, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో నమూనాలు సేకరించి పరీక్షించగా 9 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నట్లు తేలిందన్నారు. వీరిలో 27 శాతం మంది నిత్యం పెయిన్ కిల్లర్స్ వినియోగిస్తున్నారని, 23 శాతం మందిలో బీపీ, 22 శాతం మందిలో మధుమేహం, 21 శాతం మంది పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజల జీవన శైలి, తినే ఆహారం, పని ఒత్తిడిలో నీళ్ల తాగక పోవడం, ఎక్కువగా డీ హైడ్రేషన్ కావడం, ఎండలో ఎక్కువ సమయం ఉండటం వంటి కారణాలు కనిపిస్తున్నాయన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కిడ్నీల పట్ల అశ్రద్ధ చేస్తే డయాలసిస్, అవయవం మార్పిడికి కష్ట, నష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నెఫ్రో ప్లస్ సహ వ్యవస్థాపకుడు కమల్ డి షా, చీఫ్ ఆఫ్‌స్టాఫ్ రిషబ్‌లు ఉన్నారు.

హైటెన్షన్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

గచ్చిబౌలి: మతిస్థిమితం లేని ఓ యువకుడు హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన సంఘటన శుక్రవారం గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగ్నంగా తిరుగుతున్న ఓ యువకుడు శుక్రవారం ఉదయం రాఘవేంద్ర కాలనీలో రోడ్డులో హైటెన్షన్ టవర్ ఎక్కాడు. దీనిని గుర్తించిన వాహనదారులు, స్థానికులు అతడిని కిందికు దిగాలని కేకలు వేసినా వినకుండా టవర్ చివరి వరకు ఎక్కాడు. దీంతో వారు డయల్ 100కు సమాచారం అందించడంతో గచ్చిబౌలి పెట్రోల్ మొబైల్ సిబ్బంది అక్కడికి చేరుకుని కిందకు దిగాలని అతడికి నచ్చజెప్పారు. దాదాపు గంట సేపటి తర్వాత అతను కిందకు దిగిరావడంతో దుస్తులు వేయించి పీఎస్‌కు తీసుకెళ్లారు. అతడిని రాజరాజేశ్వరీనగర్‌లో నివాసం ఉంటున్న ఆకాష్ ఆర్యంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.